ఆస్తిపన్ను వసూళ్లు వేగిరం

- ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.55 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.42 కోట్లు
- వసూలు కావల్సింది రూ.13 కోట్లు
- 15 రోజుల్లో లక్ష్యాన్ని చేరుకొనేందుకు అధికారుల కసరత్తు

అంబర్‌పేట, మార్చి 15 : అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను వసూలుకు అధికారులు ముమ్మర చర్యలు తీసుకుంటున్నారు. డీసీ మారుతీదివాకర్ నేతృత్వంలో ఏఎంసీలు, టీసీలు, బిల్ కలెక్టర్లు అంతా ఫీల్డ్‌మీద ఉంటూ వసూలు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం సర్కిల్‌కు ఏడు కోట్లు అదనంగా పన్ను వసూలు చేయాలనే లక్ష్యాన్ని విధించారు.

అంబర్‌పేట సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

మార్చి 31వ తేదీలోపు ఆస్తిపన్ను వసూలే లక్ష్యం..

మార్చి 31వ తేదీలోపు సర్కిల్ ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.55 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.42 కోట్లు వసూలైంది. ఇంకా రూ.13 కోట్ల పన్ను వసూలు కావాల్సి ఉంది. మిగిలిన 15 రోజుల్లో ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు బకాయిదారుల వెంట పడుతున్నారు. నోటీసులు జారీ చేస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లించకుంటే జప్తు చేస్తామని హెచ్చరికలు చేస్తున్నారు. ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

ఈనెల 31 గడువు..

ఆస్తిపన్ను కట్టేందుకు ఈ నెల 31వ తేదీ గడువు ఉంది. ఎవరైతే పన్ను మొత్తాన్ని వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేస్తారో వారి పన్నుపై ఉన్న వడ్డీలో 90 శాతం మాఫీ చేస్తున్నాం. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– మారుతీదివాకర్, డీసీ

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించాలి

కాచిగూడ, మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19వ తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లను కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నింబోలి అడ్డాలోని కార్యాలయంలో మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బీసీ బడ్జెట్‌ను రూ. 20 వేల కోట్లకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీలో బీసీలకు రూ.38 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించారని ఆయన గుర్తు చేశారు. బీసీల బతుకులు బాగుపడాలంటే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లను కేటాయించాలని కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలలో వసతులు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని, అందుకు సొంత భావనాలను నిర్మించాలని కోరారు. బడ్జెట్‌లో బీసీలకు నిధులను కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, ముత్యాలరావు, భాస్కర్, ప్రశాంత్ నిమ్కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేట్ల బుర్జ్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పనిచేయని లిఫ్టులు

చార్మినార్, మార్చి 15 : రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గొప్పలు చెప్పుకున్న ప్రభు త్వం క్షేత్ర స్థాయికి వచ్చే సరికి ప్రభుత్వ ఆసుపత్రులు అంటే నరకం చూపుతున్నాయి. గర్భిణులు పై అంతస్తుల్లో చికిత్సలు పొందాలంటే లిఫ్ట్ ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఆసుపత్రుల్లోని లిఫ్ట్ లు ఎప్పుడు పనిచేస్తాయో.. ఎప్పుడు ఆగిపోతాయో తెలియని పరిస్థితి.

మూడు లిఫ్ట్‌లు ఉన్నా..

పేట్ల బుర్జ్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో మూడు ప్రధాన లిఫ్టులు ఉన్నాయి. ఇందులో శస్త్రచికిత్స అనంతరం ప్రసూతి స్త్రీలను ఇతర వార్డుల్లోకి తరలించడానికి వినియోగించే ప్రధాన లిఫ్ట్ తో పాటు ఔట్ పేషెంట్ విభాగంలోనూ మరో లిఫ్ట్ సేవలు అందిస్తుంది. మరో లిఫ్ట్ ఉద్యోగులు ఇతర అధికారులు వైద్యులు వినియోగించుకోవడానికి అందుబాటులో ఉంది. కొన్ని సమయాల్లో సైతం పేషెంట్లను ఇతర విభాగాల్లోకి తరలించడానికి వినియోగిస్తున్నారు. ఇందులో మొదటి రెండు లిఫ్టులు పేషెంట్లను షిఫ్ట్ చేయడానికి ఉపయోగిస్తున్న కొన్ని సందర్భాల్లో లెఫ్ట్ ల మోరాయింపులతో సిబ్బంది పేషెంట్ల బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లిఫ్టు వినియోగించే సమయంలో ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి. లిఫ్ట్ ల కంటే అధికంగా ర్యాంపులను వినియోగించుకుంటూ స్ట్రక్చర్లపై పేషంట్లను తరలిస్తున్నారు. ర్యాంపుల ద్వారా తరలించే సమయంలో శస్త్రచికిత్సలు జరిగిన బాలింతలు ర్యాంపులపై ఉన్న గతుకుల వల్ల కుట్లు వేసిన చోట అధిక నొప్పులకు గురవుతున్నారని బంధువులు తెలిపారు.

ప్రత్యేక విభాగం ఏదీ లేదు..

లిఫ్టులు మొరాయించినప్పుడు అప్పటికప్పుడు వాటిని బాగు చేసి వినియోగంలోకి తీసుకు రావాలంటే ఆసుపత్రిలో టెక్నీషియన్స్ అందుబాటులో లేరు. ఏదైనా లిఫ్ట్ ఆగిపోయినప్పుడు ఆసుపత్రి సిబ్బంది ఎమర్జెన్సీగ తమకు తెలిసిన విధానం ద్వారా అందులోని పేషెంట్లను బయటకు తీస్తున్నారు. ఇప్పటికైనా లిఫ్టులకు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సంపత్ మృతికి కారణమైన పోలీసులపై కేసు నమోదు చేయాలి

చిక్కడపల్లి,మార్చి 15: పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో మృతి చెందాడని, ఆయన మృతికి కారణమైన పోలీసులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కస్టడీలో మృతి చెందిన సంపత్ కుటుంబానికి న్యాయం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. సంపత్ మ్యాన్ పవర్ సప్లై లైసెన్స్‌తో కొంతమందిని గల్ఫ్ దేశాలకు పంపారని వారికి గల్ఫ్‌లో సరైన ఉపాధి అవకాశాలు కల్పించలేదని నెపంతో అతడిని నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. పోలీసులు మళ్లీ కోర్టు ద్వారా కస్టడీకి తీసుకోని తీవ్రంగా హింసించడం వల్లే సంపత్ మృతి చెందాడని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత పోలీస్ అధికారులను డిస్మిస్ చేసి హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. అంతేకాకుండా సంపత్ కుటుంబ సభ్యులకు యాభై లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

రవీంద్రభారతి, మార్చి15 : తల్లిదండ్రులను గౌరవించడం మన సంప్రదాయమని కానీ ప్రస్తుత సమాజంలో అది లోపిస్తుందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కళావేదికపై ప్రదీప్ చంద్ర ఈవెంట్స్ ఆధ్వర్యంలో కలాపోషకులు డాక్టర్ వి.రామదాసు మూర్తి 90వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దైవజ్ఞశర్మ విచ్చేసి మాట్లాడారు. అనంతరం వడ్ల కొండ వెంకటరావుకు పురస్కారాన్ని అందజేశారు. ఎస్‌బీఐ విశ్రాంత అధికారి సీహెచ్ త్రినాథరావు, వి.ప్రదీప్ చంద్ర పాల్గొన్నారు

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

బాగ్‌అంబర్‌పేట డివిజన్ భారత్‌నగర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో బాగ్ అంబర్పేట కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కే పద్మావతి డీపీరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరాస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు.

– అంబర్ పేట, మార్చి 15

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడండి

జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, మార్చి 15 : వేసవికాలం నేపథ్యంలో గోషామహల్ నియోజకవర్గంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ జలమండలి అధికారులను కోరారు. శనివారం ఆయన బొగ్గులకుంటలోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో జలమండలి డివిజన్ 4 జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోషామహల్ నియోజక వర్గంలో పాడైన చేతిపంపులు, పవర్ బోర్లకు మరమ్మతులు చేయించి ప్రజలకు అందు బాటులోకి తేవాలని సూచించారు. ఉగాది నేపథ్యంలో పొంగి పొర్లుతున్న శివరేజీ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జాన్‌బాగ్ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అహ్మద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శనలో నృత్యకారిణులు

రవీంద్రభారతి, మార్చి 15: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవళి ఆర్ట్స్ అకాడమీ నిర్వహిస్తున్న మూలవాసుల మాసోత్సవం సందర్భంగా మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి మహాసభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాఅధ్యక్షుడిగా కళానిధి డా.జి.మాస్టార్‌జీ, అతిథులుగా జర్నలిస్ట్ విరాహత్‌అలీ, న్యాయవాది తలకొక్కుల రాజు, గొల్లపల్లి దయానంద్, వైద్యులు యాదయ్య, బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్ తదితరులు విచ్చేసి కాన్షీన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ కాన్షీరామ్ గొప్ప బహుజన రాజకీయ వేత్త అని, ఆయన ఉత్తరప్రదేశ్‌కు రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేశారని కొనియాడారు. ఈ సభకు ముందు నృత్యగురువు రవళి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పలువురు కూచిపూడి, జానపద నృత్యాలు నృత్యకారిణులు ప్రదర్శించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు.అనంతరం కోకిలమ్మ పాట అడియో వీడియో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా.జి.శాంతాకుమార్,జి.రామచంద్రన్, రచయిత్రి డా శరత జోత్న, సురభీలక్ష్మి శారద, ఉషాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మెహిదీపట్నం, మార్చి 15: గుడిమల్కాపూర్ డివిజన్, నవోదయ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమన్ వేదిక కమ్యూనిటీ బేస్డ్ కేర్ ప్రోగ్రాం, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్, రెయిన్‌బో హోమ్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏ ర్పాటుచేసిన శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ వైద్యులు 150 మందికి వైద్య పరిక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ముఖ్య అతిథిగా పీపుల్స్ కలెక్టివ్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ప్రతినిధి అంబిక విచ్చేసి మాట్లాడారు. రెయిన్‌బో ఫౌండేషన్ ఇండియా, సిటీ డెస్క్ మేనేజర్ క్రాంతి కిరణ్, అమన్ వేదిక ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఎల్లయ్య, నమ్రత, సీబీసీ కోఆర్డినేటర్‌లు నాగభూషణం, రామస్వామి, రాజు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీల నాయకత్వంతోనే బహుజనుల రాజ్యాధికారం

సమావేశంలో పాల్గొన్న వక్తలు

తెలుగుయూనివర్సిటీ, మార్చి 15 : బీసీల నాయకత్వంతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని సైఫాబాద్‌లోని డిక్కీ సమావేశమందిరంలో సామాజిక న్యాయం జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన బహుజన రాజకీయ పార్టీ అనివార్యం అనే అంశంపై మేధావులతో కూడిన సమావేశం శనివారం జరిగింది, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యతతోనే బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలని ప్రభంజన్ కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం పరిపాలిస్తున్న పార్టీలతో సామాజిక న్యాయం జరగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నను మాస స్వామి, ప్రొఫెసర్ వెంకటదాసు, డాక్టర్ ప్రవీణ్, తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు, బత్తుల సిద్ధేశ్వర్, రోజానేత తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బహుజనుల కోసం ఉద్యమించిన గొప్ప నేత కాన్షీరామ్

రవీంద్రభారతి,మార్చి15: దేశంలో 85 శాతం ఉన్న బహుజనులకు రాజ్యాధికార సాధన కోసం జీవితాంతం ఉద్యమించిన గొప్ప నేత కాన్షీరామ్ అని పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలలో 27 శాతం సాధించడానికి మండల్ కమిషన్ అమలు కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించిన మహనీయుడు కాన్షీరామ్ అని నారగోని తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లో కాన్షీరామ్ 91వ జయంతి వేడుకలను నారగోని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా నారగోని, కేబీ శ్రీధర్, జీఏ నేతాజీ, ఎంబీ గోపి, న్యాయవాది నాగుల శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌యాదవ్, లక్ష్మణ్, ఎం.నర్స య్య, పరమేశ్వర్ తదితరులు విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా నారగోని మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌ను ఒక మోడల్‌గా ప్రయోగం చేసి నాలుగు సార్లు మాయవతిని ముఖ్యమంత్రిని చేసిన గొప్ప నాయకుడు అని చెప్పారు. బహుజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడని రాష్ట్రంలో కాన్షీరామ్ స్ఫూర్తిగా బహుజనులు ఉద్యమించి రాజ్యాధికారం చేజిక్కించుకోవాలని ఆయన అన్నారు.

బీఈడీ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 15 : ఓయూ పరిధిలోని బీఈడీ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నవంబర్‌లో జరిగిన బీఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాక్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని తెలిపారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ప్రీ పీహెచ్‌డీ(పీహెచ్‌డీ కోర్స్ వర్క్) పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఫ్యాకల్టీల ప్రీ పీహెచ్డీ రెగ్యులర్, బ్యాక్‌లాక్, వన్ టైంచాన్స్ పరీక్షా ఫీజును ఈ నెల 24లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

బీబీఏ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో బీబీఏ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ(రెగ్యులర్) ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించామని, అదే తేదీ నుంచి పరీక్షలను ప్రారంభిస్తున్నప్పటికీ ఇతర పరీక్షల తేదీలను మార్చినట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పేర్కొన్నారు.

వివిధ సైకాలజీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ సైకాలజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ, ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, పీఎస్వైడీ క్లినికల్ సైకాలజీ మొదటి సంవత్సరం రెగ్యులర్, ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని పేర్కొన్నారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ జవాబుపత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షల జవాబుపత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 7లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

పేదల వైద్యానికి సహకారం అందిస్తా..

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్



లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మార్చి 15 : నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు తనవంతు సహకారం అందిస్తున్నానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పార్సీగుట్టకు చెందిన పద్మావతి రూ.2 లక్షలు, చిలకలగూడకు చెందిన మహమ్మద్ ఫిరోజ్‌కు రూ.2 లక్షలు, వారసిగూడకు చెందిన భవానికి రూ. 2 లక్షలు, అడ్డగుట్టకు చెందిన బాబుమియాకు రూ. లక్షా పదివేల చొప్పున మొత్తం రూ.7.10 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలు మంజూరయ్యాయి. ఆయా ఎల్ఓసీలను శనివారం సీతాఫలమండీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫలమండీలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

తెలుగు సారస్వతంలో సినారెకు సుస్థిర స్థానం

పురస్కార గ్రహీతలతో ఓలేటి పార్వతీశం, వంశీ రామరాజు

ముషీరాబాద్, మార్చి 15: తెలుగు సారస్వతంలో సుస్థిర స్థానం సంపాదించుకున్న సినీ గీత రచయిత సీ నారాయణరెడ్డి అని సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. శనివారం వంశీ ఆర్ట్స్ థియేటర్స్, కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో సీ నారాయణరెడ్డి తొలి సినీ గీత రచన చేసి 65 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'సినారె పాటకు పట్టాభిషేకం' పేరుతో నిర్వహించిన మధుర గీతాల విభావరి అలరించింది. గాయకులు మిత్ర, గీతాంజలి, కృష్ణ ప్రసాద్, ఇందు నయన పలు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి జలంధర, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ డిజిటల్ బోధన

చిక్కడపల్లి, మార్చి 15: మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ డిజిటల్ బోధనను విద్యార్థులకు అందిస్తున్నామని అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ అప్పలయ్య తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలను బోధించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉద్యోగ సాధనలో ఎదుర్కొనే సంఘటనలు వాటి పరిష్కారాలను బోధించనున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కాచిగూడ, మార్చి 15: అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూకల్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం –2 చివర్లో అనారోగ్యంతో ఉంటూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతిని ఒంటిపై నీలిరంగు చొక్క, నలుపు రంగు ప్యాంటు ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇఫ్తార్ విందు

నాంపల్లి నియోజకవర్గం రెడ్ హిల్స్ డివిజన్‌లోని మహమ్మదీయ మసీదులో బోహారా కమిటీ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్ హుస్సేన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓవైసీ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో అందరూ ఆధ్యాత్మిక భావనతో ఉపవాస దీక్షను జరుపుకోవాలని అన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 15

కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి ఎండి లైన్స్ లో నిజాం మిలటరీ క్వార్టర్స్ లో శనివారం రాత్రి ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని రంజాన్ మాసంలో ఆధ్యాత్మికత వెల్లి విరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసిరుద్దీన్, ఎంఐఎం నాయకులు హరుణ్ ఫర్హాన్, వజీ ఉజ్జమసిద్ధిఖి, అమీరుద్దీన్ పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 15

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

మంచినీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాయాదవ్ తదితరులు

కాచిగూడ, మార్చి 15: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. బర్కత్‌పుర తెలంగాణ యువతీ మండలి సమీపంలో నీటి పైపులైను పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కనీస సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాచిగూడ డివిజన్ రూపు రేఖలు మార్చేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, సంతోష్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.